epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:37

24 క్యారెట్లు 154,580.00 | కిలో వెండి 2,60,000.00 | chourastha Digitals | 22.09.2026 మంగళవారం, హైదరాబాద్

## ప్రసాదంలో మత్తుమందు



- స్పృహ కోల్పోయిన తర్వాత మహిళలపై లైంగికదాడి..
- పోలీసులు రంగప్రవేశం కామాంధ పూజారిని అరెస్టు
- తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాలో ఘటన

2లో





## తాతా మధు, నవీన్ రెడ్డికి
# హైకోర్టు నోటీసులు

- స్పీకర్‌ను దూషించిన కేసులో ఎమ్మెల్సీలకు నోటీసులు
- నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టి వేయాలని పోలీసులు పిటిషన్
- తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా

స్పీకర్‌ను దూషించిన కేసులో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గతంలో వీరిద్దరిని అరెస్టు చేయొద్దని నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీనిపై పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టి వేయాలని పోలీసులు పిటిషన్ వేశారు. వీరిద్దరూ కలిసి అసభ్య పదజాలంతో దూషించారని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌నే ఇద్దరూ దూషించారని పీపీ పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి

।మిగతా 2 లో।



# జూరాల వద్ద హైటెన్షన్

## సాగునీటి కోసం రైతుల ఆందోళన

- ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్
- ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- డ్యాం చుట్టూ పోలీస్ పహారా
- గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట
- రైతుల నిరసనకు మద్దతుగా బీఆర్ఎస్ ధర్నా, హౌస్ అరెస్టులు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ

।మిగతా 2 లో।

## సోనియా గాంధీకి
# ఢిల్లీ కోర్టు షాక్



- పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు
- పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే
- ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- గతంలో దీనిపై దర్యాప్తును తిరస్కరించిన మేజిస్ట్రియల్ కోర్టు
- తాజాగా దాన్ని కొట్టివేస్తూ ఆదేశాలు

2లో


తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేండ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది.

## దానం పిటిషన్
# విచారణకు అనుమతి

- రేపు సుప్రీంకోర్టులో విచారణ
- పార్టీ ఫిరాయించారన్న కారణంతో ఎమ్మెల్యే పదవికి అనర్హుడన్న హైకోర్టు

2లో



## పోటీ పరీక్షల్లో
# సిలబస్ మార్పు చేయలేదు

- సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన వద్దు
- ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఒక సంవత్సరం ముందే తెలియజెస్తాం
- ప్రకటన విడుదల చేసిన టీజీపీఎస్సీ

4లో



## మా పార్టీ శ్రేణుల అణచివేతకు
# ప్రభుత్వ కుట్ర

- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం
- మేం తప్పులు చేస్తే చర్యలు తీసుకోవచ్చు
- సిరిసిల్లలో 8 వేల ఎకరాలుకబ్జా చేసిందెవరు?
- బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన
- జూరాలలో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు?
- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం
- బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల

।మిగతా 2 లో।

## లింగాల కేదారి, పుష్పలత
# సేవలు మరువలేనివి

- మలిదశఉద్యమంలో వారివి కీలక పాత్ర
- వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

2లో




## భారత బీమా రంగంలో సమూల మార్పులు

4లో

- బీమా రంగంలోనూ యూపీఐ
- పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీకి ఐఆర్‌డీఏఐ కసరత్తు

# జూరాల వద్ద హైటెన్షన్








**తరువాయి భాగం**

ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

**జూరాలలో నీళ్లున్నా ఎందుకివ్వరు: చిట్టెం రామ్మోహన్‌రెడ్డి**

ఆందోళన సందర్భంగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో నీళ్లున్నా ఆయకట్టుకు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. జూరాల ప్రాజెక్టులో తొమ్మిది టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, సాగు చేసిన పంటలు ఎండిపోతున్నందున సాగునీటి అవసరాల కోసం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి అవసరాలకు రెండు టీఎంసీలు సరిపోతాయని, మిగిలిన ఏడు టీఎంసీలను సాగు నీటికి ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. రైతుల పంటల్ని కాపాడేందుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు. జూరాల డ్యామ్ వ్యవసాయం కోసం కట్టిందని, తాగునీటి కోసం కాదని స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ జిల్లాకు తాగునీరు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వస్తుందని తెలిపారు. జూరాల నుంచి తాగునీరు వాడకూడదనే విషయాన్ని మంత్రి తెలుసుకోవాలని సూచించారు. మంత్రికి శక్తి ఉంటే కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి నీటిని తీసుకురావాలని హితువు పలికారు. గతంలో నీటి కొరత వచ్చినప్పుడు మక్తల్ పట్టణం పక్కన ఉన్న సంఘం బెండ నుంచి నీళ్లు తీసుకొచ్చి ఇక్కడి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ప్రభుత్వం ఎన్ని రోజులు తప్పించుకుంటుందని ప్రశ్నించారు. పంట చేతికి వచ్చే సమయంలో నీటిని నిలిపివేయడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పే కాంగ్రెస్ రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని విమర్శించారు.

**ప్రాజెక్టు వద్ద పోలీస్ పహారా**

రైతుల ఆందోళన నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ, ఎస్సైలు, పోలీసులు ఏఆర్ సిబ్బందితో నిరంతర పహారా కాస్తున్నారు. ప్రాజెక్టు వైపు వెళ్లే అన్ని రహదారుల్లో వాహన తనిఖీలు చేపట్టారు. జూరాల చుట్టూ పోలీసు బలగాలు మోహరించాయి.

**ముట్టడికి బీఆర్ఎస్ పిలుపు.. ముందస్తు అరెస్టులు**

జూరాల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ ఇచ్చిన డ్యాం ముట్టడి పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉదయం నుంచి బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు నాయకు లు రవి కుమార్ యాదవ్, మండ్ల రామకృష్ణ, వీరేష్ లింగం, లక్ష్మీకాంత్ రెడ్డి, కోటేష్ తదితరులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

# మా పార్టీ శ్రేణుల అణచివేతకు ప్రభుత్వ కుట్ర



**తరువాయి భాగం**

కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయట పెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నెపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా?అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.





# తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టు నోటీసులు

**తరువాయి భాగం**

చేశారని పీపీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఓఎస్డీ వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిద్దరిపై ఎస్టీ, ఎస్సీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం ఇద్దరికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి, పోలీసుల రిమాండ్ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. నిందితులు ఇద్దరూ చెరో పదివేల చొప్పున పూచీకత్తుతో పాటు రెండేసి ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించింది.


**తీర్మానానికి అసంబ్లీ ఆమోదం**

గతంలో సభాపతి గౌరవాన్ని భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అలాగే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతూ మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేండ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమ వారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివే శారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్ను దాఖలు చేశారు.“భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 175(3)ను పాటిం చకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పిం చకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వు లో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యా మ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణ నలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది.” అని న్యాయమూర్తి అన్నారు.‘ఆ చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదు’ ఫిర్యాదులో గుర్తిం చదగిన నేరం జరిగినట్లు వెల్లడైందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే మేజిస్ట్రేట్ పౌరసత్వం అనే అంశం వైపు మళ్లారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా బీఎన్ఎస్ఎస్ కింద ప్రొసీడింగ్స్ నిర్వహించడం అనే చట్టప రమైన ప్రత్యామ్నా యాలను మెజిస్ట్రేట్ పరిశీలిం చలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజా వాదన లు విన్న న్యాయ స్థానం కార ణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయాలని మేజిస్ట్రేట్‌కు తిరిగి పంపింది. ఈ కేసు తదుపరి విచారణ కోసం సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు.



ఈ తీర్పును ఢిల్లీ కోర్టు తాజాగా పక్కనబెట్టడంతో దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది.

**కేసు ఏంటంటే?**

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతంలో బీజేపీ నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని అందులో పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని చెప్పారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని రాసుకొచ్చారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని ఆరోపిం చారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి?’’ అని ప్రశ్నించారు. ఈ క్రమంలో నే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది



# దానం పిటిషన్ విచారణకు అనుమతి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

దానం నాగేందర్ పిటిషన్ విచారణకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. తెలంగాణ హైకోర్టు అనర్హత ఆదేశాల నేపథ్యంలో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌పై ఆందోళనగా ఉందని దానం నాగేం దర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి సుప్రీంకోర్టుకు నివేదించారు. అందువల్ల ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. పార్టీ ఫిరాయించారన్న కారణంతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును ఈనెల 19న దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ అనర్హత పిటిషన్‌పై విచారణ జరపాలని దానం నాగేందర్ తరపు ముకుల్ రోహిత్గి సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించగా, తెలంగాణ హైకోర్టు విచారించి అనర్హతా వేటు వేసిందని వివరించారు. ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అందువల్ల అత్యవసరంగా విచారించాలని కోరారు. ‘రేపటి విచారణ జాబితాలో అత్యవసరంగా విచారించాలని కోరుతున్నాను. గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఇదే విషయంలో దానం నాగేందర్ పై పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించారు. దానం నాగేందర్ తన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. కానీ.. పార్టీతో సంబంధం లేని వ్యక్తి (బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్) ఈ పిటిషన్‌ను వేశారు’ అని ధర్మాసనానికి నివేదించారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని అనర్హతకు సంబంధించినదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం, స్పీకర్ ఖైరతాబాద్ ఖాళీ అని నోటిఫై చేస్తే ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసే ఆస్కారం ఉందన్నారు. అందువల్ల పిటిషన్‌ను నేడు (మంగళవారం) విచారణ చేపట్టాలని కోరారు. ప్రతివాదుల తరపు న్యాయవాదులు కూడా కోర్టు హాల్‌లోనే ఉన్నారని నివేదించారు. దీనిపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలాని స్పందిస్తూ, రేపు (బుధవారం) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. అన్ని వైపుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న తాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(ఎ) రెడ్ విత్ ఆర్టికల్ 191(2)కింద తనను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎమ్మెల్యే అనర్హత విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయా లను న్యాయస్థానాలు సమీక్షించడానికి వీలులేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# లింగాల కేదారి, పుష్పలత సేవలు మరువలేనివి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**


తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మరణించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల సాయం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యారు.ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మిరెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రసాదంలో మత్తుమందు

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**

ఆలయానికి వచ్చే మహిళలకు ప్రసాదంలో మత్తు మందు కలిపి ఇచ్చే ఓ పూజారి... ఆ మహిళలు స్పృహ కోల్పోయిన తర్వాత లైంగికదాడికి పాల్పడుతూ వచ్చాడు. కొన్నేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా జరుపుతూ వచ్చిన పూజారి బండారాన్ని ఓ విద్యార్థిని బహిర్గంత చేసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆ కామాంధ పూజారిని అరెస్టు చేశారు. ఈ ఘటన తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వాళపాడి అనే గ్రామంలో వెలుగు చూసింది. వివరాల్లోకెళితే....వాళపాడి ప్రాంతంలో శనీశ్వరుని పేరుతో విజయరాజ (50) అనే వ్యక్తి ఆశ్రమాన్ని చిన్నపాటి ఆలయాన్ని నడుపుతున్నాడు. స్థానికులను పూజలు, చేతబడుల పేరుతో నమ్మించాడు. దీంతో తన వద్దకు వచ్చిన మహిళలు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతూ వచ్చాడు. ఈ క్రమంలో వినాయకచవితి పండుగ సందర్భంగా ... ఓ విద్యార్థిని చందా కోసం ఆ పూజారి వద్దకు వెళ్లగా పూజారి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిపోయిన ఆ బాలిక... పూజారి చేసినదంతా తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు పూజారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత పోలీసుల తనిఖీల్లో అతడి ల్యాప్‌టాప్‌లో 50 కి పైగా అశ్లీల వీడియోలు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పూజల కోసం వచ్చే మహిళలకు ప్రసాదంలో మత్తుమందు కలిపి ఇచ్చి, వారు స్పృహ కోల్పోయిన తర్వాత అఘాయిత్యానికి పాల్పడుతూ సీక్రెట్ కెమెరాతో ఆ దృశ్యాలను చిత్రీకరించేవాడని నిర్ధారణ అయ్యింది. ఈ వీడియోలను డబ్బు కోసం డార్క్ వెబ్ పోర్టర్స్‌కు విక్రయించినట్టు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. పూజారిని అరెస్టు చేసి, అతని ఫోను, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.





## ఘనంగా వినాయకుడి నిమజ్జనం

**పీర్జాదిగూడ తెలంగాణ చౌరస్తా**

పీర్జాదిగూడలోని వినాయక నగర్ కాలనీ రోడ్ నంబర్ 02లో గణేష్ నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ కాలనీవాసులంతా ఏకమై మట్టి వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించి, భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. సుమారు 200కు పైగా కుటుంబాలు నివసించే ఈ కాలనీలో, ప్రతి ఇంటా విడివిడిగా కాకుండా అందరూ కలిసి "ఒకే కాలనీ  ఒకే గణపతి" అనే గొప్ప సంకల్పంతో ముందుకు రావడం విశేషం. ఈ ఉత్సవాలలో మతసామరస్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హిందువులతో పాటు ముస్లిం, క్రిస్టియన్ సోదరులు సైతం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సోదరభవానికి నిదర్శనంగా నిలిచారు. నవరాత్రుల అనంతరం ఆ మండపం వద్దనే వినాయకుడి విగ్రహాన్ని ఎంతో కోలాహలంగా నిమజ్జనం చేశారు. అంతకుముందు వాడవాడలా గణనాథునికి పల్లకీ



సేవతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల సఫలీకృతానికి కాలనీ కమిటీ ప్రతినిధులు జక్కిడి శ్రీలత, వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు ప్రత్యేక కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, మతసామరస్యాన్ని చాటిచెప్పిన కమిటీ సభ్యులను పర్యావరణ ప్రేమికులు, కాలనీవాసులు, మహిళలు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.





# వెంటిలేటర్‌పై 'వరంగల్ ఎంజీఎం' ఆసుపత్రి

- అధ్వానంగా 'ఎంజీఎం'దుస్థితి...
- రోగుల అవస్థలు ఓవైపు ఆసుపత్రిలో గాయాలు మరోవైపు
- ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు కూలి రోగులకు గాయాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన వైద్యమంత్రి రాజనర్సింహ
- వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్
- ఆసుపత్రి వద్ద బీజేపీ నేతలకు,పోలీసులతో తీవ్ర వాగ్వాదం
- కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గంట రవికుమార్ ఘాటు విమర్శలు
- పదవుల వేటలో పడి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచుతారా?
- కొండా సురేఖ,నాయిని రాజేందర్ రెడ్డిల స్వార్థ రాజకీయాలంటూ వ్యాఖ్యలు

**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**

ఉత్తర తెలంగాణకే తలమానికమై వరంగల్ నగరంలోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల వెం




టిలేటర్‌పై కొట్టుమిట్టాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.నిన్న ఎంజీఎం ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో అకస్మాత్తుగా ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడిపడి,చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే.ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బీజేపీ నాయకులు ఎంజీఎం ఆసుపత్రికి చేరగా,ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని చూసిన పోలీసులతో బీజేపీ నాయకులకు మొదటగా తీవ్ర వాగ్వాదం జరిగింది.పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ బీజేపీ శ్రేణులు నిన్న ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ వార్డు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.అక్కడి వాతావరణంలో రోగులు పడుతున్న ఇబ్బందులను,భవన శిథిలావస్థను చూసి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

***పదవులపై,కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు..***

అనంతరం గంట రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై,స్థానిక ప్రజాప్రతినిధులపై నిప్పులు చెరిగారు.స్థానిక "కాంగ్రెస్ మంత్రులకు,ఎమ్మెల్యేలకు కేవలం వారి పదవులపై,కమిషన్లు వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై,ప్రజల ప్రాణాలపై అస్సలు లేదు" అని ఘాటుగా విమర్శించారు.నిరుపేద ప్రజలకు అత్యాధునిక ఉచిత వైద్యం అందించాల్సిన ఆరోగ్యశ్రీ వార్డులోనే పైకప్పు కూలి రోగుల ప్రాణాల మీదకు రావడం అధికారుల,పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

***రోగాల నుండి కాపాడాల్సిన ఆసుపత్రే వెంటిలేటర్ పై ఉంది...***

ప్రజలను రోగాల బారి నుండి కాపాడాల్సిన ఎంజీఎం ఆసుపత్రి,అధికారుల నిర్లక్ష్యం వల్ల తానే వెంటిలేటర్‌పై ఉన్న దుస్థితికి చేరింది.కనీస మౌలిక వసతులు ఈ ఆసుపత్రిని చూసి వరంగల్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.రోగులను కాపాడలేక పోతున్న ఇటువంటి నిర్లక్ష్యపు అధికారులపై,వైద్య శాఖపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.పేరు గొప్ప ఊరు దిబ్బగా మారిన ఎంజీఎం ఆసుపత్రి భవనాల భద్రతపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని,గాయపడిన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని,ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై,వైద్య రంగంలో వారి వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గంట రవికుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా,జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్,జిల్లా కార్యదర్శిలు గోకే వెంకటేష్,వెంకట్ రావు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు టేకుమట్ల రేణుక,కూచన క్రాంతి కుమార్,ఎర్రగోళ్ల భరత్ వీర్,బిజెపి జిల్లా నాయకులు అంకాల జనార్ధన్,బైరి శ్యాంసుందర్,నోముల రతన్, గోగికార్ అనిల్,చిలువేరు రాజేందర్,మాచర్ల దీన్ దయాల్, గుర్రాల చంద్రమౌళి,గడ్డం మహేందర్, ర్నే రవీందర్, మందోటి మహేందర్,షేర్ల అనిల్, కోమాకుల నాగరాజు,మడిపల్లి నాగరాజు,మార్త ఉషారాణి, స్వర్ణజ,శైలశ్రీ, సుజాత,మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సీతా నాగరాజు,రజనీష్, తాళ్లపల్లి శ్రీనివాస్,జెట్లింగ్ శివ, బోడకుంట్ల శివ,ఆడేపు రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పల్లవి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పల్లవి స్కూల్ విద్యార్థుల ప్రతిభపెద్దపల్లి ఐటీ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన ఎస్ జి ఎఫ్ జోనల్ బూలెవెల్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో పల్లవి స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థుల వివరాల్లో వి.సాహిత్ 200 మీటర్ల పరుగు: మొదటి స్థానం,600 మీటర్ల పరుగు: మొదటి స్థానం,లాంగ్ జంప్: రెండో స్థానం,కె.గౌతమ్ లాంగ్ జంప్: మూడో స్థానం సాధించారు.ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కరస్పాండెంట్ శోభారాణి,ప్రిన్సిపాల్ జరీనా,పీఈటీ అనిల్,ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించి,జిల్లా స్థాయిలో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు.



## కొండా లక్ష్మణ్ బాబూజీ సేవలు మరువలేం

- కొండా లక్ష్మణ్ బాబూజీ ఘన నివాళులు

**కాల్వ శ్రీరాంపూర్ , తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాబూజీ వర్ధంతి సందర్భంగా  ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమంలో కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేమన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘమ్ గ్రామ అధ్యక్షులు,ఉప సర్పంచ్ గోలి సుధాకర్,మండల అధ్యక్షులు సబ్బని రాయమల్లు,జిల్లా ప్రచార కార్యదర్శి ఒడ్నాల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు,పద్మశాలి వార్డు మెబార్స్ గోలి శ్రీనివాస్,గోలి నరేష్,శ్రీనివాస్,కోశాధికారి రమేష్ బైరి కుమార్,గోలి రమణయ్య,గోలి రంగయ్య,గోలి శ్రీకాంత్,ఎనగందుల సంతోష్,గోలి రమణయ్య కాసర్ల శ్రీనివాస్,వోడ్నాల రాజన్న వోడ్నాల రమేష్,గోలి కేశేవులు,కోట రాజానర్స్,సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.




## మండల ప్రజావాణికి 2 దరఖాస్తులు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సురేందర్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమానికి 17మంది అధికారులు హాజరయ్యారని పేర్కొన్నారు.అర్జీలను వేగంగా పరిష్కారించాలని వెంటనే ఆయా సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు ఎంపీడీవో స్పష్టం చేశారు.



## గణపతి నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

కాసిపేట మండలంలోని సోమగూడెం, లంబాడి తండా (కె),లంబాడి తండా (డి) గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ రత్నం ప్రదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,పాడిపంటలతో,అష్టైశ్వర్యాలతో  ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు.ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య,కాసిపేట సర్పంచ్ నీలా రాంచందర్,డా.రాజమౌళి, మైదాం రమేష్,గోలేటి స్వామి,కుర్మ నర్సయ్య,పులుగం వెంకటేష్,భూక్యా రవి, మహంకాళి,అజ్మీరా తిరుపతి, తోడేటి ప్రశాంత్,దుర్గం ప్రవీణ్,బానోత్ కిరణ్,పొన్నాల అక్షయ్,రామకృష్ణ గౌడ్,విష్ణు,సుమంత్,రాజకుమార్,కుడిమేత శేఖర్,గాజు నాయక్,అజ్మీరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## తాగునీరు,డ్రైనేజీ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

కాసిపేట మండలంలోని పెద్ద ధర్మారం గ్రామంలో నెలకొన్న తాగునీరు,డ్రైనేజీ,పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.తెలంగాణ రక్షణ సేన కాసిపేట మండల ఇంచార్జి సోదరి సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల పరిసరాల్లో నిలిచిపోతోందని గ్రామస్థులు తెలిపారు.దీంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిందనిరజ్వరాల వ్యాప్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ఫాగింగ్ నిర్వహించడంతో పాటు మురుగునీటిని తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీరు అందేలా చేయండి అంటూ గ్రామస్థులు అధికారులను వేడుకున్నారు.పెద్ద ధర్మారంలో తాగునీరు,డ్రైనేజీ,పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు సురక్షితమైన తాగునీరు,ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల యువజన నాయకులు గంగాధరి రాజ్ కుమార్ తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాడి ప్రవీణ్ కు ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు

- మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడికి దక్కిన గౌరవం

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన టీజీటీ ఉపాధ్యాయుడు (సైన్స్) జాడి ప్రవీణ్ రాష్ట్ర స్థాయి జేఈటి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు-2026కు ఎంపికయ్యారు.జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రాన్ని సృజనాత్మకంగా బోధిస్తూ వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రవీణ్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు సైన్స్ ఫెయిర్లు,ఇన్నోవేషన్ ప్రాజెక్టులు సైన్స్ డ్రామా,క్విజ్‌లు తదితర రాష్ట్ర,జాతీయ స్థాయి విజ్ఞాన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వ్యవసాయం,పర్యావరణ పరిరక్షణ,వ్యర్థాల నిర్వహణ,పునరుత్పాదక ఇంధనం వంటి అంశాలపై విద్యార్థులను వినూత్న ప్రాజెక్టుల వైపు ప్రోత్సహిస్తున్నారు.అంతేకాకుండా ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌గా,శిక్షకుడిగా వ్యవహరిస్తూ నూతన బోధనా పద్ధతులను తోటి ఉపాధ్యాయులకు అందిస్తున్నారు.ఈ సందర్భంగా జాడి ప్రవీణ్ మాట్లాడుతూ....ఈ పురస్కారం విద్యార్థులను మరింత ప్రోత్సహించడంతో పాటు తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.ప్రవీణ్ సాధించిన ఈ ఘనతపై పాఠశాల ప్రిన్సిపల్,ఉపాధ్యాయ బృందం,సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.



## ఎదురుగడ్డలో వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- 'టీం గరుడ' ఆధ్వర్యంలో మహా అన్నదానం
- మాలోత్ రాందాస్ నాయక్ తనయుడు విగ్నేష్ నాయక్
- చెంచుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,అఖిల.

**లక్ష్మీదేవిపల్లి భద్రాద్రి బ్యూరో : తెలంగాణ చౌరస్తా :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 'టీం గరుడ' యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. స్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాదాలు, అన్నదానం పంపిణీ చేశారు.ఈ విశేష కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్  నాయక్ తనయుడు విగ్నేష్ నాయక్, ఎదురుగడ్డ గ్రామ సర్పంచ్ బట్టు అరుణ్ నాయక్, చుంచుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్హెచ్ఓ అఖిల కూచిపూడి జగన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావనతో పాటు సామాజిక దృక్పథంతో యువత ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తి శ్రద్ధలతో పాటు గ్రామంలో శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. 'టీం గరుడ' సభ్యుల సేవాతత్పరతను, శ్రమను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీం గరుడ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భద్రాచలం రోడ్ కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో 'కంపు'

- క్యాంటీన్ వ్యర్థ నీటితో రోత పుట్టిస్తున్న పార్కింగ్ ప్రాంగణం!
- పరుగులు పెడుతున్న ప్రయాణికులు, పార్కింగ్ సిబ్బంది

**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

భద్రాద్రి కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణం పారిశుధ్య లోపానికి నిలయంగా మారింది. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన రైల్వే స్టేషన్, అధికారుల నిర్లక్ష్యం వల్ల దుర్వాసనతో కంపు కొడుతోంది. స్టేషన్‌లోని 'సెంట్రల్ రైల్వే జ్యూస్ బార్ అండ్ చాట్ స్టాల్' క్యాంటీన్ యాజమాన్యం తీరుతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర నరకం అనుభవిస్తున్నారు.ఇంకుడు గుంతలో ఆయిల్ వ్యర్థాలు.. పొంగిపొర్లుతున్న కంపు నీరు! క్యాంటీన్‌లో నిత్యం తయారుచేసే ఆయిల్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్‌కు సంబంధించిన నూనె పాత్రలు కడిగిన మురుగు నీటిని అధికారులు పార్కింగ్ స్థలంలో ఉన్న ఇంకుడు గుంతలోకి మళ్లించారు. ఆయిల్, గ్రీజుతో కూడిన వ్యర్థాలు వెళ్లడంతో ఇంకుడు గుంత పూర్తిగా మూసుకుపోయి, రోత పుట్టించే మురుగు నీరు పైకి పొంగిపొర్లుతోంది. దాంతో








పార్కింగ్ ఏరియా మొత్తమూ విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది.

**ముక్కు మూసుకుని పరుగులు తీస్తున్న ప్రయాణికులు!**

రైలు దిగి బయటకు వచ్చే వందలాది మంది ప్రయాణికులు స్టేషన్ బయట అడుగుపెట్టగానే వస్తున్న భరించలేని దుర్వాసనకు ముక్కు మూసుకుని పరుగులు తీస్తున్నారు. క్యాంటీన్ సమీపంలో నిలబడి కనీసం ప్రశాంతంగా తినలేని పరిస్థితి దాపురించింది. పార్కింగ్ దారులు, చుట్టుపక్కల మార్కెట్ కాంప్లెక్స్ వ్యాపారులు ఈ రోత వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**అంటువ్యాధుల ముప్పు.. ఆటో డ్రైవర్ల ఆగ్రహం!**

రైల్వే స్టేషన్ బయట నిత్యం ఉండే ఆటో డ్రైవర్లు, పార్కింగ్ సిబ్బంది ఈ దుర్వాసన భరించలేక తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.నిల్వ ఉన్న మురుగు నీటితో దోమలు చేరి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.

**తక్షణమే పైప్‌లైన్ మార్చాలి.. లేకపోతే పర్యవసానాలు తీవ్రం!**

ఇంకుడు గుంతలోకి నూనె నీళ్లను మళ్లించే పద్ధతిని వెంటనే నిలిపివేయాలి. క్యాంటీన్ నుంచి వచ్చే వ్యర్థ నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా దూరంగా ఉన్న ప్రధాన డ్రైనేజీలోకి పంపించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. రైల్వే ఉన్నతాధికారులు, క్యాంటీన్ యాజమాన్యం తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించకపోతే రోగాల బారిన పడాల్సి వస్తుందని ప్రయాణికులు, ఆటో కార్మికులు హెచ్చరిస్తున్నారు.



# పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు చేయలేదు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్‌లో మార్పుపై వస్తున్న అంశాలపై స్పందించింది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని నియమించలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ ఓ ప్రకటనను విడుదల చేసింది.

సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన టీజీపీఎస్సీ పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఒక సంవత్సరం ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్‌లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ ఆ వివరాలను సంబంధిత నియామక నోటిఫికేషన్‌తో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు. అభ్యర్థులు సిలబస్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని కమిషన్ పేర్కొంది.హైదరాబాద్ జలమండలి(HMWSSB)లో మేనేజర్ (ఇంజినీరింగ్) విభాగంలో 130 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వం మొత్తంగా 965 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా అందులో మొదటి విడతగా 130 మేనేజర్ పోస్టుల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన ఖాళీలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపింది. సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ) పూర్తి చేసి ఉండాలి. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ తెలిపింది.

**కీలకమైన వన్‌టైమ్ రిజిస్ట్రేషన్**

గత కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు టీజీపీఎస్సీ దరఖాస్తులో కీలకమైన వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) చేసుకున్న 31.56 లక్షల మంది తమ ఐడీ సహాయంతో తాజా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించిన సంగతి తెలిసిందే. అనంతరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ వివిధ శాఖల్లో 290 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రోడ్లు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్, 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ నెల 6 నుంచి జులై 13 వరకు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 8 నుంచి జులై 15వరకు, కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 10 నుంచి జులై 17వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. పూర్తి నోటిఫికేషన్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది.

# భారత్‌లో పెరుగుతున్న పరోక్ష ధూమపానం ముప్పు

భారత్‌లో పరోక్ష ధూమపానం తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. 1990తో పోలిస్తే 2023లో ఇతరులు వదిలిన పొగను పీల్చడం వల్ల సంభవించిన మరణాలు దాదాపు 50 శాతం పెరిగినట్లు ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. 2023లో భారత్‌లో సుమారు 3.25 లక్షల మంది పరోక్ష ధూమపానం కారణంగా మరణించినట్లు అంచనా. 1990లో ఈ సంఖ్య సుమారు 2.17 లక్షలుగా ఉంది. అంటే తాము ధూమపానం చేయకపోయినా, ఇతరుల పొగను తరచూ పీల్చే వారికి కూడా తీవ్రమైన ఆరోగ్య ముప్పు ఉందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. 2023లో చైనా తర్వాత ప్రపంచంలోనే అత్యధికంగా పరోక్ష ధూమపానానికి గురైన వారి సంఖ్య భారత్‌లోనే ఉన్నట్లు నివేదిక తెలిపింది. దేశంలో సుమారు 44.4 కోట్ల మంది ఇతరులు తాగే సిగరెట్లు, బీడీలు, సిగార్లు లేదా ఇతర పొగాకు ఉత్పత్తుల నుంచి వెలువడే పొగకు గురైనట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా 2023లో సుమారు 271 కోట్ల మంది పరోక్ష ధూమపానానికి గురయ్యారు. వీరిలో దాదాపు 76.7 కోట్ల మంది చిన్నారులు ఉన్నారు. ఇంట్లోనే కాకుండా కార్యాలయాలు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాలు, ఇతరులు ధూమపానం చేసే ప్రాంతాల్లోనూ ఈ పొగకు గురయ్యే అవకాశం ఉంటుంది.


**అనేక అవయవాలపై ప్రభావం..**

పొగాకు పొగలోని విషపూరిత రసాయనాలు గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. దీర్ఘకాలంగా పరోక్ష ధూమపానానికి గురికావడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. ఇప్పటికే గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారిలో శ్వాస ఇబ్బందులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. చిన్నారులు కూడా దీనికి ప్రత్యేకంగా సున్నితంగా ఉంటారు. వారి ఊపిరితిత్తులు, రోగనిరోధక వ్యవస్థ ఇంకా అభివృద్ధి చెందుతున్నందున పొగకు గురికావడం వల్ల శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఇతర శ్వాస సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. గర్భిణీలు పరోక్షంగా పొగ పీల్చడం వల్ల కూడా ఆరోగ్యపరమైన ముప్పు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.



## భారీగా పెరుగుతున్న బాధితుల సంఖ్య..

**అయితే గత మూడు దశాబ్దాల్లో పరోక్ష ధూమపానానికి గురయ్యే జనాభా శాతం తగ్గినప్పటికీ, మొత్తం సంఖ్య పెరగడం గమనార్హం. భారత్‌లో వయస్సు ఆధారంగా సర్దుబాటు చేసిన పరోక్ష ధూమపానానికి గురయ్యే వారి శాతం 1990లో 43.2 శాతం ఉండగా, 2023లో 30.6 శాతానికి తగ్గింది. కానీ జనాభా పెరగడంతో పొగకు గురయ్యే వారి సంఖ్య సుమారు 37.5 కోట్ల నుంచి 44.4 కోట్లకు పెరిగింది. పురుషులు, మహిళలు ఇద్దరిలోనూ పరోక్ష ధూమపానం కారణంగా మరణాలు పెరిగాయి. మహిళల్లో మరణాలు 1990లో సుమారు 1.13 లక్షల నుంచి 2023లో 1.56 లక్షలకు పెరగగా, పురుషుల్లో 1.04 లక్షల నుంచి 1.68 లక్షలకు చేరాయి.**



**నియంత్రించాల్సిందే..**

పరోక్ష ధూమపానాన్ని నివారించడానికి ఇతరుల సమీపంలో ధూమపానం చేయకపోవడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఉన్న ఇళ్లు, కార్లలో పూర్తిగా ధూమపాన రహిత వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ధూమపానం చేసే వారు దాన్ని మానేయడానికి వైద్య నిపుణుల సహాయం, సలహాలు, ధూమపాన విరమణ కార్యక్రమాలను ఉపయోగించుకోవడం మంచిది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన నిషేధ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, పరోక్ష ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన పెంచడం ద్వారా కూడా పొగకు గురయ్యే వారి సంఖ్యను తగ్గించవచ్చు.

# భారత బీమా రంగంలో సమూల మార్పులు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

భారత బీమా రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ప్రయత్నాలు ముమ్మరం చేసింది. డిజిటల్ పేమెంట్స్ రంగంలో యుపిఐ సంచలనం సృష్టించినట్లే.. బీమా రంగంలోనూ పారదర్శకతను పెంచేందుకు ప్రతిపాదిత పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీ (పీఐఆర్) తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఇటీవల ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. పాలసీదారులకు అన్ని బీమా వివరాలు ఒకే చోట లభించడం, సులభంగా కేవైసీ పూర్తి చేయడం, క్లెయిమ్ చరిత్ర అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు ఈ వ్యవస్థ ద్వారా చేకూరుతాయి. జీ20 డీపీఐ మార్గదర్శకాల ఆధారంగా రూపొందిస్తున్న ఈ ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల డేటా భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా పాలసీదారులకు, బీమా సంస్థలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా సమాచారమంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా డేటా ఎక్కడ సేకరించబడిందో అక్కడే సురక్షితంగా ఉండేలా ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్‌ను అవలంబిస్తున్నారు. దీని ద్వారా పాలసీదారులకు జీవిత, ఆరోగ్య, మోటార్ , ఆస్తి బీమాలకు సంబంధించిన అన్ని పాలసీల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. నామినీలు, రెన్యూవల్స్, క్లెయిమ్‌లు సులభంగా పర్యవేక్షించవచ్చు. పాలసీల మార్పిడి (పోర్టబిలిటీ) మరింత సులభమవుతుంది. బీమా కంపెనీలకు పాలసీలు, క్లెయిమ్ చరిత్ర పారదర్శకంగా లభించడం వల్ల అండర్‌రైటింగ్ ఖచ్చితత్వం పెరుగుతుంది. మోసాలను అరికట్టడానికి వీలవుతుందని ఐఆర్‌డిఎఐ వర్గాలు భావిస్తున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వాలకు కూడా వెరిఫైడ్ కవరేజ్ డేటా అందుబాటులోకి రావడం వల్ల రుణాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభమవుతుంది. ప్రస్తుతం బీమా రంగంలో పాలసీదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకే వ్యక్తి వివిధ బీమా సంస్థల నుంచి పాలసీలు తీసుకున్నప్పటికీ ప్రతిసారీ కేవైసీ ప్రక్రియను విడివిడిగా పూర్తి చేయాల్సి వస్తోంది. అలాగే, క్లెయిమ్ చరిత్ర అందుబాటులో లేకపోవడం వల్ల అండర్‌రైటింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతు న్నాయి.అంతేకాకుండా వినియోగదారులు తమకు నచ్చిన బీమా పాలసీని సులభంగా పోల్చుకునే అవకాశం లేక, ఏజెంట్లు చెప్పే మాటల మీదే ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టి బీమా చేయడం అనే పద్ధతి నుంచి వినియోగదారుడే స్వయంగా బీమా కొనుగోలు చేసే స్థాయికి మార్చడమే ఈ రిజిస్ట్రీ ప్రధాన ఉద్దేశం. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను పూర్తిగా ఐఆర్‌డీఏఐ యాజమాన్యంలోని లాభాపేక్ష లేని సంస్థగా పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించారు. పాలసీదారుల సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ నూతన విధానం ద్వారా బీమా రంగంలో పారదర్శకత పెరిగి రాబోయే రోజుల్లో బీమా వ్యాప్తి గణనీయంగా పుంజుకుంటుందని అంచనా వేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా యాదాసు యాదయ్య

**రామన్నపేట, తెలంగాణ చౌరస్తా:**

రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామ కాంగ్రెస్ పార్టీ సమావేశం సోమవారం నిర్వహించారు.మండల నాయకుల ఆధ్వర్యంలో గ్రామ నూతన అధ్యక్షులు గా యాదాసు యాదయ్య. కార్యదర్శి గా కమ్మంపాటి రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నా ఎన్నికకు సహకరించిన మండల నాయకులకు గ్రామ పార్టీ నాయకులకు కార్యకర్తలకు నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.







# నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

- యాదాద్రి భువనగిరి ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా :**

వినాయక నిమజ్జనాల నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్‌రెడ్డి సోమవారం నిమజ్జన ప్రదేశాలను పరిశీలించారు. ఇంద్రపాలనగరం ,బొమ్మలరామారం, చిన్నకొండూరు గ్రామాల్లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సీఐ మెలుగురి రవి, ఎస్ఐ గోపాతి సతీష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.